ప్రజాశక్తి

శుక్రవారం 26 ఏప్రిల్ 2024 | 1 | అనంతపురం | శ్రీ సత్యసాయి

'పురం'..సమస్యలు అపరిష్కృతం..!

- ఎన్నికల హామీలు మాటలకే పరిమితం
- స్థానిక సమస్యల ప్రస్తావన కరువు
- పేరుకే ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా స్థాయి హోదా
- కనిపించని ప్రభుత్వ కళాశాలలు
- స్థానిక సమస్యలు కూడా అనేకం..!

హిందూపురం నియోజకవర్గంకు రాష్ట్ర స్థాయి గుర్తింపు ఉంది. దీనికి కారణం ఇక్కడి నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు. ముఖ్యమంత్రి.. ముఖ్యమంత్రి వారసులను అసెంబ్లీకి పంపిన నియోజకవర్గం ఇది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న హిందూపురంలో నేటికీ అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఎన్నికల సమయంలో ఆయా పార్టీలు వాగ్దానాలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం మరోసారి ఎన్నికల సంగ్రామం నడుస్తోంది. ఎటు చూసినా పార్టీల నాయకుల వాగ్దానాలతో పురం హోరెత్తుతోంది. ఈ పరిస్థితుల్లో గత హామీల సంగతేంటి అన్న ప్రశ్న ఇక్కడి ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

నందమూరి బాలకృష్ణ (టిడిపి)

దీపిక (వైసిపి)

ప్రజాశక్తి-హిందూపురం

2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి హిందూపురం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇక వైసిపి అభ్యర్థిగా దీపిక బరిలో ఉన్నారు. వీరితో పాటు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. కూటమి, వైసిపి అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాలతో జనం వద్దకు వెళ్తున్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమం చూసి ఓటు వేయాలని వైసిపి, తమ మ్యానిఫెస్టో, గత టిడిపి ప్రభుత్వ హయాంలో హంద్రీనీవా, గాలేరుతో పాటు నీటి ప్రాజెక్టులు తీసుకొచ్చానని, హిందూపురంను పారిశ్రామికంగా అభివృద్ధి చేశానని, పట్టణంలో ఉన్న నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించానని చెబుతూ కూటమి అభ్యర్థి బాలకృష్ణ ఓట్లను అభ్యర్థిస్తున్నారు.

హంద్రీనీవాపై రైతుల ఆశలు..!

ప్రధాన పార్టీల అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా పార్టీలు చెబుతున్న హామీలను వల్లేవేస్తున్నారే గానీ స్థానిక సమస్యలను ప్రచారంలో ప్రస్తావించడం లేదు. ఈ ప్రాంత అభివృద్ధికి ఏం చేస్తాం అన్న దానిపై స్పష్టమైన హామీని ఇవ్వడం లేదు. వైసిపి, టిడిపి రెండు పార్టీలూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారంపై హామీ ఇవ్వకపోవడం పట్ల స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. హిందూపురం నియోజకవర్గంలో ప్రధానంగా ఈ ప్రాంత రైతులు ఎన్నో సంవత్సరాలుగా హంద్రీనీవా ఎప్పుడు పూర్తి అవుతుందని ఎదురు చూస్తున్నారు. ఇది పూర్తయితే అన్ని గ్రామాల చెరువులకు కృష్ణ జలాలు అందే అవకాశం ఉంది. టిడిపి అధికారంలో ఉన్న సమయంలో నందమూరి బాలకృష్ణ కృష్ణా జలాలతో అన్ని చెరువులను హంద్రీనీవా నీటితో నింపుతామన్నారు. అయితే లేపాక్షి చెరువు తప్ప ఇతర ఏ చెరువుకూ నీరివ్వలేదు. ఇక చిలమత్తూరు మండలంకు రూ.500 కోట్లు ఖర్చు చేసి ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవా నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. దీనికి డిపిఆర్ సైతం సిద్ధం చేశామని 2018లో బాలయ్య ప్రకటించారు. ఆచరణలో అది కన్పించలేదు. హంద్రీనీవా పనులు అన్నీ పూర్తి చేయడంతో పాటు గొల్లపల్లి జలశాయానికి వరద జలాలు కాకుండా మిగులు జలాలను కేటయించి హిందూపురం నియోజక వర్గంలో ఉన్న అన్ని చెరువులకూ నీరు అందించి ఆదుకోవాలని ఇక్కడి రైతులు కోరుతున్నారు.

కలగానే డిగ్రీ కళాశాల

హిందూపురం నియోజకవర్గంలో విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం సమస్యలు తప్పడం లేదు. ప్రభుత్వ పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల లేక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలో కనీసం ఐటిఐ కళాశాల లేదు. ప్రస్తుతం బాలికలకు ఒక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ఇక ఎస్‌డిజిఎస్ ఎయిడెడ్ కళాశాల వైసిపి పాలనలో దాని రూపు కోల్పోయి మిగతా 3లో

నీళ్లు లేక ఎండిపోయిన హంద్రీనీవా కాలువ

మౌలిక సదుపాయాలు లేని పూలకుంట ఇందిరమ్మ కాలనీ

ఆటో నగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ముగిసిన తొలి ఘట్టం

ఆఖరి రోజు నామినేషన్ల జోరు

నామినేషన్‌ను దాఖలు చేస్తున్న రాప్తాడు టిడిపి అభ్యర్థి పరిటాల సునీత

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో తొలిఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గడువు గురువారంతో ముగిసింది. ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఎన్నికల నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగిసింది. వారం రోజులో పాటు సాగిన ఈ నామినేషన్ల స్వీకరణలో పెద్దఎత్తున జిల్లాలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఆఖరి రోజు అయిన గురువారం మరిన్ని ఎక్కువగా నామినేషన్లు పడ్డాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్రులు అనేక మంది నామినేషన్లు దాఖలు చేసిన వారిలోనున్నారు. సత్యసాయి జిల్లాలో హిందూపురం పార్లమెంటు నియోజకవ్గానికి గురువారం నాడు ఒక్క రోజే 40 నామినేషన్లు దాఖలయ్యాయి. అదే విధంగా అసెంబ్లి నియోజకవర్గాలకు చూస్తే 77 నామినేషన్లు పడ్డాయి. మడకశిరకు 13 నామినేషన్లు దాఖలవగా, పెనుకొండకు పది నామినేషన్లు పడ్డాయి. హిందూపురం అసెంబ్లికి 14 నామినేషన్లు దాఖలయ్యాయి. కదిరికి 13, ధర్మవరం అసెంబ్లి నియోజకవర్గానికి తొమ్మిది నామినేషన్లు పుట్టపర్తికి 15 నామినేషన్లు దాఖలయ్యాయి. అనంతపురం జిల్లాలోనూ జోరుగానే నామినేషన్లు దాఖలయ్యాయి. శింగనమల అసెంబ్లి నియోజకవర్గానికి ఆఖరి రోజు 12 మంది 13 సెట్ల నామినేషన్ల దాఖలు చేశారు. కళ్యాణదుర్గం అసెంబ్లి నియోజకవర్గానికి 17 మంది అభ్యర్థులు 29 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గుంతకల్లు అసెంబ్లి నియోజకవర్గానికి 21 మంది అభ్యర్థులు 37 నామినేషన్లు దాఖలు చేశారు. తాడిపత్రి అసెంబ్లి నియోజకవర్గానికి 16 మంది అభ్యర్థులు 18 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. శింగనమల అసెంబ్లి నియోజకవర్గానికి 30 సెట్ల మిగతా 3లో

సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

నీటి సమస్యపై గ్రామస్తుల ఆగ్రహం

ఖాళీ బిందెలతో సచివాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని కొట్లపల్లి బీసీ కాలనీలో నీటి సమస్యపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య తీర్చాలని గ్రామానికి చెందిన పలువురు గ్రామ సచివాలయం ముందు ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. దాదాపు గంటపాటు ఆక్కడే నిరసన తెలిపారు. సచివాలయ అధికారులు అందుబాటులో లేకపోవడంతో విధుల్లో ఉన్న మహిళా పోలీసుకు సమస్యను విన్నవించారు. కొట్లపల్లి, సురగానిపల్లి రెండు గ్రామాలకు కలిపి గ్రామ పంచాయతీ నీటి పథకానికి మూడు బోర్లు ఉన్నాయన్నారు. ఇందులో ఒక బోరు మరమ్మతుకు గురైందన్నారు. రెండు బోర్లలో నీరు సమద్ధిగా రాకపోవడంతో మిగతా 3లో

పలువురు వైసిపిలో చేరిక

అనంతపురం : నగరంలోని 49వ డివిజన్‌కు చెందిన టిడిపి నాయకులు జూటూరు మారుతి, గొడ్డుమర్రి మురళీమోహన్, సావిత్రి, యలంకూరు లక్ష్మన్న, రాము, సత్తి, శేఖర్, రాజు, ఆదిలక్ష్మి, అమల, అనిత తదితరులు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డి స్వగృహం వద్ద గురువారం వైసిపిలో చేరారు. అదేవిధంగా అనంతపురం రూరల్ పంచాయతీకి చెందిన రాప్తాడు రామాంజినేయులు, నరేష్, లలిత, మేఘన, నాగమణి, యమునతో పాటు పలు రజక కుటుంబాలు వైసిపిలో చేరాయి. అలాగే ఆజాద్‌నగర్‌కు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. అదేవిధంగా 22వ డివిజన్ వైసిపి నేత చిరంజీవి ఆధ్వర్యంలో ఎంఐఎం నుంచి పలువురు వైసిపిలో చేరారు. వీరికి వెంకటరామిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో షేక్షావలి, గౌస్‌మొహిద్దీన్, ఖాజామున్ని, ఎర్రిస్వామి, కుళ్లాయప్ప, భవాని, లక్ష్మి, గౌసియా బేగం, హసీనా, దిల్షాన్ తదితరులు ఉన్నారు.

టిడిపితోనే పరిశ్రమల స్థాపన : దగ్గుపాటి

మాట్లాడుతున్న దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రానికి పరిశ్రమలు రావాలన్నా.. ఉద్యోగాలు రావాలన్నా.. ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని అనంతపురం అర్బన్ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. నిరుద్యోగ జెఎసి ఛైర్మన్ షేక్ సిద్దిక్ ఆధ్వర్యంలో గురువారం నగరంలో చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్రను దగ్గుపాటి ప్రారంభించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి సాయినగర్‌లో ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో రాష్ట్రం, జిల్లాకు వచ్చిన పరిశ్రమలు వెల్లగొట్టి పేదలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని విమర్శించారు. ఇలాంటి పరిస్థితుల్లో చంద్రబాబు మళ్లీ సిఎం అయితేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందన్నారు. తాను గెలిచిన వెంటనే అనంతపురంలో ఎస్ఇజెడ్‌లు ఏర్పాటు చేసి పరిశ్రమలు తీసుకొస్తానన్నారు.

మీ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్‌ను మారుస్తుంది

కాగా నగరంలోని పలు డివిజన్లలో దగ్గుపాటి ప్రసాద్ సతీమణి దగ్గుపాటి శ్రీలక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 27వ డివిజన్‌లో సరిపూటి రమణ, సరిపూటి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. 2వ డివిజన్ కల్పనాజోషి కాలనీలో ప్రచారం చేపట్టారు. కాలనీల్లో దగ్గుపాటి శ్రీలక్ష్మికి అనూహ్య స్పందన కనిపించింది. ప్రజలు ఆప్యాయంగా పలకరిస్తూ ఆమెకు స్వాగతం పలికారు.

టిడిపిలోకి పెరుగుతున్న చేరికలు

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి నాయకత్వాన్ని బలపరుస్తూ నియోజకవర్గంలో వైసిపి నుంచి టిడిపిలోకి వలసలు పెరిగాయి. ఇందులో భాగంగా నారాయణపురం పంచాయతీలోని తపోవనానికి చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరారు. వారిని దగ్గుపాటి టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో బళ్లారి చలపతి, బళ్లారి గోవిందు, బళ్లారి సుధాకర్, బళ్లారి రామకష్ట, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, లీలావతి, రూప, మనోజ్, అభిషేక్, రత్నమ్మ, అశోక్ తదితరులు ఉన్నారు. మరోవైపు సున్నపుగేరిలో బోయపాటి రమణ ఆధ్వర్యంలో శీన, సిద్దారెడ్డి, పవన్, షామీర్, శివశంకర్‌తో వందల మంది పార్టీలో చేరారు.

జెఇఇ మెయిన్స్‌లో 'నారాయణ' ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ కళాశాల సిబ్బంది

జెఇఇ మెయిన్స్-2024 ఫలితాల్లో అనంతపురం నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. గోసుకొండ శశికిరణ్ 258 మార్కులు సాధించి 1830వ ఆలిండియా ఓపెన్ కేటగిరీ ర్యాంకు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే చిగిచెర్ల మేఘన ఆలిండియా ర్యాంకు 5829, ఓబీసీ కేటగిరీలో 1220 ర్యాంకు సాధించింది. అన్ని క్యాటగిరీల్లో 33 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక ఎనాటి, ట్రిపుల్ ఐటీల్లో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు ఎంపికయ్యారు. జనరల్ కేటగిరీలో 91.24లోపు 8 మంది, ఈడబ్ల్యుఎస్ క్యాటగిరీలో 81.33లోపు 40 మంది, ఓబిసి

ర్యాంకులు సాధించిన విద్యార్థులు

ఎన్‌సిఎల్ కేటగిరీలో 79.68లోపు 46 మంది, ఎస్సీ క్యాటగిరిలో 60.09లోపు 24 మంది, ఎస్టీ క్యాటగిరీలో 46.70లోపు 28 మంది ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల డీన్ బికె బద్రీనాథ్, ఎజిఎం వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్‌రెడ్డి, ఓబన్నగౌడ్, హిమబిందు, లక్ష్మన్న, శిఖామణి, శ్రీధర్‌బాబు, జయలక్ష్మి, ఎజిఎం కేశవరెడ్డి, హరిప్రసాద్ పుష్పగుచ్చాలు అందజేసి స్వీట్స్ ఇచ్చి అభినందనలు తెలిపారు.

'పది' స్టేట్ టాపర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రణతిరెడ్డిని సన్మానిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన తన్నేరు ప్రణతిరెడ్డి (598 మార్కులు)ని గురువారం నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య బాలికల పాఠశాల (ఎటిపి)-4లో అభినందించారు. ఆమెతోపాటు పి.కీర్తన (590), ఎం.తన్విత (590), సి.శ్రీజరాయల్ (589), డి.నిహారిక (589), ఎస్.పూజిత (587), ఎస్.నవ్యశ్రీ (586) డి.నందిని (585), కె.రాజ్యశ్రీ (585), డి.చిన్మయా (585), జి.చరిత (581), వైపి.కీర్తి (580)ని, తల్లిదండ్రులను సత్కరించారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాలల ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థినీ ఆత్మవిశ్వాసం, సంకల్ప సిద్ధితో ఉత్తమ ఫలితాలు సాధించి యాజమాన్యానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎటిపి-4 ప్రిన్సిపాల్ సమీనఖాన్, వైస్ ప్రిన్సిపాల్ శమీనా, అకడమిక్ కో ఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సత్యనారాయణ, చంద్రమోహన్, బెస్ట్ ఇన్‌ఛార్జి రజియా, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న చోట కనీస మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షులు అమ్మలదిన్నె కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వందల సంఖ్యలో కూలీలు ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారన్నారు. అయితే పనులు చేసేచోట కనీస నీడ ఏర్పాటు చేయడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేసే చోట నీడ, మంచిని సౌకర్యం, మజ్జిగ, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. అవేవీ కల్పించడం లేదన్నారు. ఇదేమని అడిగి ప్రభుత్వం అలాంటివి ఏవీ కల్పించడం లేదని అధికారులు చెబుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి పనులు చేసే చోట కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ, ఎపిఒను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఉపాధి కూలీలపై నిర్లక్ష్యం వహించకుండా వసతులు కల్పించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శేఖర్, ఎర్రాగప్ప, తిమ్మాశెట్టి, వెంకట్రాముడు, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని చక్రాయపేట పంచాయతీ సి.బండమీదపల్లి గ్రామానికి చెందిన పలువురు గురువారం వైసిపిలో చేరారు. ఉప సర్పంచి గోగుల పెద్ద బాల సంజీవరాయుడు, శెట్టిపల్లి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలకు అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామిరెడ్డి, చిన్న బాల సంజీవరాయుడు, రామాంజనేయులు, అదెప్ప, వీరాంజనేయులు, నాగేంద్ర, డేరంగుల రామాంజనేయులు, రవి, పరుశు రాముడు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే బెస్తలకు సామాజిక న్యాయం

వజ్రకరూరు : రాష్ట్రంలో బెస్త కులస్తులకు సామాజిక న్యాయం కల్పించిన వైసిపికే తమ మద్దతు ఉంటుందని బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమణ అన్నారు. గురువారం ఉరవకొండ వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం గుర్తించని బెస్త కులాలను సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక బెస్త కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒక ఛైర్మన్, 12 మంది డైరెక్టర్లను నియమించి సముచిత న్యాయం కల్పించారన్నారు. అంతేగాకుండా బెస్తలను రాజకీయంగా అభివద్ధి చేయాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ, ఎంపీ టికెట్లు కేటాయిస్తూ వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. సముద్రతీర ప్రాంతాల్లో బెస్త గంగపుత్రులకు మత్స్యకార భరోసా, యంత్ర పడవలు, మోటార్ పడవలు, వేట నిషేధ కాలంలో మత్స్యకార భరోసా కింద రూ.10వేలు ఇచ్చారన్నారు. కావున బెస్త కులస్తులందరూ అనంతపురం వైసిపి ఎంపీ అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ, ఉరవకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెస్త సేవాసంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎర్రిస్వామి, టౌన్ సెక్రటరీ రామన్న, విడపనకల్ మండల కార్యదర్శి ఎర్రిస్వామి, కార్యవర్గ సభ్యులు పంపాపతి, వన్నూరుస్వామి, రాము, మల్లికార్జున, ఆంజనేయులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు : మలేరియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి సబిహా సూచించారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శింగనమల : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా తరిమెల పిహెచ్‌సి వైద్యాధికారి శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా జ్వరం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

భారీ అగ్ని ప్రమాదం..రూ.15 లక్షల ఆస్తినష్టం

బుక్కరాయసముద్రం : మండలంలోని చెదుళ్ల గ్రామంలో గురువారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు, రైతులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చెదుళ్ల-నీలంపల్లి గ్రామాల మధ్యలో ఉన్న అనంతపురంలోని మారుతీనగర్‌కు చెందిన శ్రీదేవికి చెందిన 12 ఎకరాల వ్యవసాయ భూమిలో 3,600 దానిమ్మ చెట్లు, 600 పెద్ద రేగుచెట్లు, 99 కొబ్బరి చెట్లు, 14 జామచెట్లు, రెండు చింతచెట్లు, రెండు సపోటా చెట్లు ఉన్నాయి. ఈనేపథ్యంలో పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆయా పంటలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో రూ.15 లక్షల ఆస్తినష్టం సంభవించిందని బాధిత రైతు వాపోయింది. బాధ్యులను శిక్షించి తనకు న్యాయం చేయాలని కోరింది. కాగా బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత రైతులకు పరామర్శ

పెద్దపప్పూరు : విద్యుత్ ప్రమాదంలో పంటలు కోల్పోయిన బాధిత రైతులను వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. మండలంలోని మండలం అమ్మలదిన్నె, వరదాయపల్లి గ్రామాలకు చెందిన నాగార్జున సాగు చేసిన అరటి తోట, దూదేకుల గిరికి చెందిన మొక్కజొన్న తోట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న హర్షవర్ధన్‌రెడ్డి ఆయా గ్రామాలకు చెందిన రైతులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపిడిఒ

బెలుగుప్ప : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. గురువారం మండల పరిధిలోని హనుమరెడ్డిపల్లి, అంకంపల్లి, దుద్దేకుంట, గంగవరం గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా సచివాలయాలకు సంబంధించిన వివరాలు, హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది విధిగా విధులకు హాజరై సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జగదీష్, గోపాల్, రామ్మూర్తి, ఉమాదేవి, శోభన్‌బాబు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ

అనంతపురం క్రైం : ఎన్నికల వేళ గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని అనంతపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి సూచించారు. ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సి.ఐ రెడ్డెప్ప, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఉదయం టిడిపి..రాత్రికి వైసిపి

ఒకేరోజు కండువాలు మార్చిన నాయకులు

ఆత్మకూరు : ఉదయం 11గంటలకు టిడిపిలో చేరారు.. తిరిగి రాత్రి 11 గంటలకు మళ్లీ వైసిపిలోకి చేరారు.. వివరాలోకి వెళ్తే.. మండలంలోని ముట్టాల గ్రామానికి వైసీపీ నాయకులు కురుబ ఎర్రిస్వామి, ఆనందరెడ్డి, ఆదినారాయణ యాదవ్, కురుబ మహేష్, తదితరులు బుధవారం ఉదయం 11 గంటలకు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా టిడిపి అభ్యర్థి పరిటాల సునీల వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడి వరకూ బాగానే ఉంది. అయితే అదేరోజు రాత్రి 11 గంటలకల్లా తిరిగి సొంత గూడు వైసిపికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వీరందరికీ మళ్లీ వైసిపి కండువాలు కప్పి వైసిపిలోకి ఆహ్వానించారు. ఏదిఏమైనా ఎన్నికల నేపథ్యంలో అక్కడి వారు ఇక్కడికి.. ఇక్కడి వారు అక్కడికీ మారుతున్నారని చెప్పవచ్చు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వైసిపి ఐదు సంవత్సరాల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని తలమర్ల పంచాయతీలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రతి ఇంటికీ తిరిగి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాలనలో చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. ఐదేళ్ల కాలంలో ఒక్క పరిశ్రమ అయినా పుట్టపర్తికి వచ్చిందాని ప్రశ్నించారు. 193 చెరువులకు నీళ్లు అన్నారే తప్పా ఎక్కడైనా ఒక్క చుక్క నీరు ఇచ్చావా అని నిలదీశారు. ఐదేళ్లలో ఒక్క నీటి పైప్‌లైన్ కూడా వేయలేదన్నారు. బ్యాంకులను సైతం మోసం చేసిన వ్యక్తి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఇలాంటి మాయ మాటలను వచ్చే ఎన్నికల్లో పుట్టపర్తి ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. మే 13న పుట్టపర్తి గడ్డపై టీడీపీ జెండా ఎగరడం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు డిఎన్.మూర్తి, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, సర్పంచి రత్నమ్మ కమ్మన్న, మాజీ సర్పంచులు రమేష్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు లక్ష్మీనారాయణ, గఫార్‌తో పాటు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : తెలుగుదేశం పార్టీతోనే పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గురువారం నాడు పుట్టపర్తి టిడిపి అభ్యర్థి పల్లె సింధూరకు మద్దతుగా టిడిపి నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రజలతో ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరిఫ్ ఖాన్, షాను, మాబాషా, తోఫిక్ అలీఖాన్, అఖిల, మస్తానమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

మాతాశిశు మరణాలు లేకుండా చూద్దాం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో మాతాశిశు మరణాలు నమోదు కాకుండా చూడాలని శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.వి.కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గత నాలుగు రోజులుగా ఎంఎల్‌హెచ్‌పిలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి హాజరైన జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి 379 మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, 41 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 361 మంది ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారన్నారు. శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ వారి పరిధిలో ప్రజల ఆరోగ్యం మెరుగునకు కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూత్రాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ కెసి.కుళ్లాయప్ప నాయక్, నాగరాజు, డాక్టర్ మాధుర్య, సరిత, హర్షిత, శివ శ్వేత పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి హిందూపురం, లేపాక్షి లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పోలీసు శాఖ అబ్జర్వర్ నాగాలాండ్ కు చెందిన ఇమ్నా లెనాస్ప గురువారం తనిఖీ చేశారు. తొలుత హిందూపురం బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తో కలిసి కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం భద్రత ఏర్పాట్లపై స్థానిక అధికారులతో చర్చించారు. నియోజకవర్గాల వారీగా గదుల కేటాయింపు, ఈవీఎంలు, వివి ప్యాట్స్ భద్రపరిచే స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చర్యలు తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్, హిందూపురం డిఎస్పి కంజాక్షన్‌తో ఆరా తీశారు. అనంతరం లేపాక్షి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐ లు ఈరన్న, తబ్రేజ్, ఎస్ఐ గోపి, ఎలక్షన్ డి. టి.రెడ్డి శేఖర్, ఆర్ఐ అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో ఆటో డ్రైవర్ కుమారుడి ప్రతిభ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని గుడ్డంపల్లితండాకుకు ఆటోడ్రైవర్ కుమారుడు జ్యోతి ప్రసాద్ నాయక్ గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 2821వ ర్యాంక్ సాధించాడు. జ్యోతి ప్రసాద్ తండ్రి మురళి నాయక్ ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తుంటాడు. తమ కుమారుడు మంచి ర్యాంకు సాధించినందుకు తండ్రి మురళినాయక్‌తో పాటు తల్లి సుజాత బాయ్ ఆనందం వ్యక్తం చేశారు.

భాష్యం పాఠశాలకు గుర్తింపు లేదు : ఎంఇఒ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో నూతనంగా ప్రారంభిస్తున్న భాష్యం పాఠశాలకు ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు లేదని ఎంఇఒ గంగప్ప స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐతో పాటు ఇతర విద్యార్థి సంఘాల నాయకులు అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన ఎంఇఒ గురువారం పట్టణంలో పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పట్టణంలో ప్రారంభిస్తున్న భాష్యం పాఠశాలకు ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు లేదన్నారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులను అడ్మిషన్ చేయరాదన్నారు.

ప్రతిభా విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచిన పట్టణంలోని కాకతీయ విద్యా నికేతన్ స్కూలుకు చెందిన నిత్యశ్రీని డిఇఒ మీనాక్షి దేవి అభినందించారు. ఈ మేరకు ఆమె గురువారం ధర్మవరంలో విద్యార్థి నిత్యశ్రీని కలసి శుభాకాంక్షలు తెలిపారు. నిత్యశ్రీ భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ శెట్టిపి నిర్మల జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డి, శెట్టిపి పద్మ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులలో గాని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో గాని సకాలంలో వైద్య చికిత్సలు పొందాలని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి కోరారు. అంతేకాక మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారుఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని వడ్డీ వారిపల్లి సోమవతి నదీ పరివాహక ప్రాంతంలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యం అయ్యింది. ఇందుకు సంబంధించి ఎఎస్ఐ కిషోర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వేమారెడ్డిపల్లికి చెందిన కృష్ణమూర్తి(43) మృతదేహం వడ్డివారిపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాస్టల్ ఎనుకవైపున ఉన్న సోమవతి నది పరివాహక ప్రాంతంలో ఉన్నట్టు ఉపాధి కూలీలు గుర్తించి విఆర్ఒకు సమాచారం ఇచ్చారు. దీంతో విఆర్ఒ ఆంజనేయులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు వేమారెడ్డికి గుర్తించారు. ఈయన మృతి చెంది నాలుగైదు రోజులు అయినట్లు తెలుస్తోంది. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అనుమానాస్పద స్థితి మృతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని పుట్టపర్తి, కొత్తచెరువు ప్రధాన రహదారిలోని మామిళ్ళకుంట క్రాస్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు గురువారం మృతి చెందాడు. ఈయన వయసు 70 సంవత్సరాలు ఉంటుంది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రోడ్డుపై విగతజీవిగా పడి ఉన్న ఆయను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని పుట్టపర్తి రూరల్ పోలీసులు పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతుని వివరాలు గుర్తించడం కష్టం అయ్యింది. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే పుట్టపర్తి రూరల్ ఎస్ఐని సంప్రదించాలని ఆయన కోరారు.

యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని చౌడేపల్లికి చెందిన పూల మంజునాథ్ రెడ్డి (26) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఇంటిలో ఉన్న ఫ్యానుకు మంజునాథరెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎఎస్ఐ కిషోర్ రెడ్డి తెలిపారు. మృతునికి నాలుగునెలల క్రితం వివాహమైందన్నారు. మృతుని తల్లిదండ్రులు కళావతి, లక్ష్మిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

చిలమత్తూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని గ్రంథాలయసంస్థ జిల్లా కార్యదర్శి రమ గురువారం తనిఖీ చేశారు. ఈ మేరకు ఆమె రికార్డులను పరిశీలించారు. శాశ్వత చందాలు పెంచాలని, పాఠకుల సంఖ్య కూడా పెంచాలని గ్రంథాలయాధికారి మల్లికార్జునకు సూచించారు. పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించాలన్నారు.

మొదటి పేజి తరువాయి

'పురం'.. సమస్యలు అపరిష్కృతం..!

నిర్వీర్యం అయ్యింది. ప్రభుత్వ చర్యలతో ప్రస్తుతం ఈ కళాశాల పూర్తిగా ప్రయివేటు కళాశాలగా మారింది. టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేసి, తాత్కాలికంగా పట్టణంలోని రూస్సీ లక్ష్మీబాయి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించేలా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభించారు. ప్రారంభం అయితే అయ్యింది కానీ ఇక్కడ డిగ్రీ కళాశాల కొనసాగలేదు. సిబ్బంది నియామకం, భవనాల కేటాయింపులు జరక్కపోవడంతో దీనిని మూసివేశారు. డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇక్కడి విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అపరిష్కృతంగా స్థానిక సమస్యలు

హిందూపురం పట్టణంలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల విస్తరణ జరగలేదు. గత 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ఆటోనగర్‌తో పాటు ఇందిరమ్మ కాలనీలో ప్రజలకు అవసరమైన సిసి రోడ్లు, మురుగు కాలువలు, కనీస మౌలిక సదుపాయాలు ఇప్పటికీ కల్పించలేదు. పురపాలక సంఘంలో ఉన్న ప్రధాన నీటి సమస్యను ఇప్పటి వరకు శాశ్వతంగా పరిష్కరించలేదు. హిందూపురంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా స్థాయి హోదాను కల్పించారే గానీ అందుకు తగ్గట్టుగా వసతులు కల్పించలేదు. ఇప్పటికీ ఈ ఆసుపత్రి ఏరియా ఆసుపత్రి తరహాలోనే ఉంది. సిటి, ఎంఆర్ఐ స్కాన్, అత్యవసర వైద్య సేవల కోసం వెంటిలేటర్లు లేవు. ప్రత్యేక వైద్య నిపుణులు పూర్తి స్థాయిలో లేరు. 2014లో ఎన్నికల సమయంలో బాలకృష్ణ తనను ఈ ప్రాంత ప్రజలు ఆదరిస్తే క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ ఇప్పటికీ నెరవేరలేదు. మెడికల్ కళాశాల రాలేదు. వీటితో పాటు అనేక స్థానిక సమస్యలను పరిష్కరించాలంటూ ఇక్కడి ప్రజలు ప్రతి ఎన్నికల్లోనూ పార్టీల నాయకులను కోరుతున్నారు. అయినా పట్టించుకునే పరిస్థితులు లేవు. ఈ ఎన్నికల్లో అయినా ప్రధాన పార్టీల నాయకులు ఈ సమస్యలను పరిష్కరించేలా స్పష్టమైన హామీతో ముందుకు రావాలని పురం ప్రజలు కోరుతున్నారు.

నీటి సమస్యపై గ్రామస్తుల ఆగ్రహం

బీసీ కాలనీలో గత నెలరోజుల నుంచి నీటి సమస్య నెలకొందన్నారు. వ్యవసాయ బోరుబావులు వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రం వద్ద కేంద్ర ప్రభుత్వ నిధులతో గత సంవత్సరం బోరు వేసినా దానికి మోటారు బిగించలేదన్నారు. ఈ బోరు నుంచి గ్రామంలో ఉన్న పైప్‌లైన్‌కు నీటి సరఫరా చేస్తే గ్రామంలో అన్ని ప్రాంతాలకు నీరు పుష్కలంగా అందుతాయని తెలిపారు. అధికారులు ఆదిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి, కొట్లపల్లి బీసీ కాలనీ వాసులు రామయ్య, బేల్దారి రామాంజి, రాములమ్మ, ఆంజనేయులు, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ముగిసిన తొలిఘట్టం

నామినేషన్లు దాఖలు అయ్యాయి. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గానికి గురువారం ఒక్క రోజే 19 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఆఖరి రోజు అట్టహాసంగా

నామినేషన్ల స్వీకరణ గడువు ముగింపు రోజు పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులు అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి పరిటాల సునీత పెద్దఎత్తున జన సందోహం మధ్య నామినేషన్ దాఖలు చేశారు. కళ్యాణదుర్గంలో టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు నామినేషన్ దాఖలు చేసిన వారిలోనున్నారు. శింగనమలలో బండారు శ్రావణి జనసందోహం మధ్య నామినేషన్ వేశారు. ఇలా పలు నియోజకవర్గాల్లో గురువారంపెద్దఎత్తున నామినేషన్లు వేశారు.

నేడు పరిశీలన

నామినేషన్ల దాఖలు ప్రక్రియ పూర్తవడంతో శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉండనుంది. ఆయా నియోజకవర్గాల్లోనే నామినేషన్ పత్రాలను అధికారులు పరిశీలించనున్నారు ఏదైనా తేడాలుంటే ఆ నామినేషన్లను అంగీకరించే అవకాశముండదు. ఈ మేరకు ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం రోజు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిటర్నింగు అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈనెల 29వ తేది వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండనుంది.

ప్రజాశక్తి
www.prajasakti.com
అనంతపురం
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

కూటమి బెదిరింపులను సహించం

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ఢిల్లీ నాయకుడని చెప్పుకునే వ్యక్తి సిద్ధాంతాలు, విలువలకు తిలోదకాలిచ్చి దర్మవరం నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డబ్బులు వెదజల్లుతూ, ప్రజల్ని ప్రలోభాలకు గురి చేస్తూ తమపై బెదిరింపులకు దిగుతున్నారని ఇలాంటి వాటికి భయపడేది లేదని వైసిపి ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు నెల ముందుగా వచ్చిన ఎన్డీఏ అభ్యర్థి సత్యకుమార్ ఇతరరాష్ట్రాల వారిని రెండువేల మందిని తెచ్చుకుని డబ్బుతో రాజకీయం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ వారిని, సానుభూతి పరులను, పార్టీకి అండగా ఉండే వ్యాపారస్తులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి బెదిరింపులకు భయపడేవారు ఎవ్వరూలేరన్నారు. డబ్బులు వెదజల్లుతూ బీసీ కార్డుతో లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు నమ్మరని అన్నారు. ఎపి కురుబ కార్పోరేషన్ చైర్మన్ కోటిబాబుకు తాను ఎంతో ప్రాధాన్యత ఇచ్చానని తెలిపారు. ఎన్నోసార్లు ఆర్థికంగా ఆదుకున్నామన్నారు. అదేవిధంగా ముదిగుబ్బ ఆదినారాయణ యాదవ్‌కు ఎంపిపిగా అవకాశం కల్పిస్తే పట్టుమని పదిమందికి కూడా సేవలందించలేదని విమర్శించారు. వీరిద్దరు డబ్బుకు, ప్రలోభాలకు అమ్ముడుపోవడం చాలా బాధ కల్గించిందన్నారు.

కూటమివి మోసపూరిత హామీలు : మక్బూల్

నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న మక్బూల్, తదితరులు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కూటమివి మోసపూరిత హామీలని కదిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం నామినేషన్‌వేశారు. అంతకుముందు పట్టణంలోని నానా దర్గా ప్రాంతం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి మక్బూల్ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రజలకు మభ్య పెట్టే మాటలు చెబుతున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటే జగనన్న అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి హిందూపురం పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు వజ్ర భాస్కర్ రెడ్డి, కదిరి అసెంబ్లీ ఎన్నికల ఇన్‌ఛార్జి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కడపల మోహన్ రెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, మాజీ సమన్వయకర్త ఎస్‌ఎండీ ఇస్మాయిల్, వైసిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తల హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తల వెంకటరమణ, పరికి సాధిక్ భాషా, సాదత్ అలీఖాన్, జిలాన్‌బాషా ప్రణీత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

దేశాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని ఇండియా వేదిక కూటమి హిందూపురం ఎంపీ అభ్యర్థి బి.ఎ. షామద్ షాహిన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం జిల్లా ఎన్నికల అధికారి అరుణ్ బాబుకు ఎమ్మెల్యే అభ్యర్థి దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి ఆర్డీవో భాగ్యరేఖకు తమ నామినేషన్లు సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ బయట వారు విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా దేశంలో నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాల వల్ల పెట్టుబడిదారులు మరింత ధనికులయ్యారన్నారు. సహజ సంపదను కార్పొరేట్లకు అప్పనంగా అప్పగిస్తున్నారన్నారు. ఓటు భయంతో కాంగ్రెస్ అభ్యర్థులను బిజెపి అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని, మహిళలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు సహాయం అందిస్తామని, నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని, అధిక ధరలను నియంత్రిస్తామని అన్నారు. మతతత్వ శక్తులను నియంత్రించి లౌకికవాదాన్ని ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోటా సత్యం, జిల్లా మహిళా అధ్యక్షురాలు షాహిన్ షకీలా, మండల పార్టీ అధ్యక్షుడు పుట్ల గంగాద్రి, పోతుల రాజు, కొండకమార్ల బాబు, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఇనాయతుల్లా వామపక్ష నాయకులతో కలిసి గురువారం తన నామినేషన్‌ను ఆర్‌ఒ అభిషేక్ కుమార్‌కు అందించారు. అంతకు ముందు వామ పక్ష నాయకులతో పాటు కాంగ్రెస్ నాయకులతో తన నివాసం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. నామినేషన్ అనంతరం బయటకు వచ్చిన ఆయన సిపిఎం నాయకులు ప్రవీణ్ కుమార్, సిపిఐ నాయకులు వినోద్ కుమార్, దాదాపీర్ లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో బిజెపి, దాని అనుబంధ ప్రాంతీయ పార్టీలు దేశ, రాష్ట్ర ప్రజలను దాగా చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను నిలువరించేందుకు దేశంలోనే కాక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు అనుగుణంగా ప్రజలు అవగాహన కలిగి ఇండియా వేదిక, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ అనంతరం మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఇనాయతుల్లా



విలక్షణం.. రాయదుర్గం రాజకీయం

◆ జిల్లా సరిహద్దున నియోజకవర్గ కేంద్రం
◆ ఎమ్మెల్యేలుగా స్వాతంత్ర్య సమరయోధులు
◆ శాంతియుత రాజకీయాలకు చిరునామా

రాయదుర్గం జిల్లాకు సరిహద్దును కర్నాటకు అనుకుని ఉంది. నియోజవకర్గంలోని చాలా మంది అటు కర్నాటక, ఇటు ఆంధ్ర రెండు రాష్ట్రాలతో సంబంధాలను కలిగి ఉంటారు. వేష, భాషల్లోనూ రెండు రాష్ట్రాల సంస్కృతిని పాటిస్తున్నారు. రాజకీయంగా ఈ నియోజకవర్గానికి ప్రత్యేకతలు ఉన్నాయి. నియోజకవర్గ కేంద్రంగా ఏర్పడి నుంచి అనేక మంది ప్రముఖులు ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించారు. స్వాతంత్ర సమరయోధులు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది శాసనసభకు వెళ్లారు. ఎలాంటి రాజకీయ కక్షలు, కార్పణ్యాలు లేకుండా ప్రశాంతతకు చిరునామాగా రాయదుర్గం నియోజవకర్గం నిలుస్తుంది.

ప్రజాశక్తి-రాయర్గం

అనంతపురం జిల్లా కర్నాటక సరిహద్దున గడినాడు ప్రాంతంలో ఉన్న రాయదుర్గం నియోజకవర్గ రాజకీయానికి ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. 1953వ సంవత్సరానికి ముందు (ఆంధ్ర రాష్ట్ర అవతరణ) ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో బళ్లారి జిల్లాలో రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం ఉండేది. ఆంధ్ర రాష్ట్ర అవతరణ సందర్భంగా స్థానికంగా కొందరు రాయదుర్గం బళ్లారి జిల్లాలోనే కొనసాగాలని డిమాండ్ చేయగా అప్పట్లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఎక్కువమంది రాయదుర్గాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయాలని కోరారు. దీంతో ఆదోని ఆలూరుతో పాటు రాయదుర్గం కూడా ఆంధ్ర రాష్ట్రంలో చేరింది. 1952 సంవత్సరంలో జరిగిన శాసనసభ ఎన్నికలలో రాయదుర్గం తొలి శాసనసభ్యులుగా రాయదుర్గం పట్టణానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు, న్యాయవాది గురుమాల్ నాగభూషణం కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందారు. ఆయన 1941 వ సంవత్సరంలో జరిగిన స్వాతంత్ర పోరాటంలో పాల్గొని అరెస్టు అయి బెంగళూరులోని కేంద్ర కారాగారంలో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించారు. 1953వ సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ అనంతరం రాయదుర్గం నియోజకవర్గం అనంతపురం జిల్లాలో చేర్చబడింది. ఇప్పటివరకు రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గంలో 17 సార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో రెండుసార్లు 1975, 2012 సంవత్సరాలలో ఉప ఎన్నికలు జరిగాయి. ఇందులో 10 సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు, మూడుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు, రెండుసార్లు వైసిపి అభ్యర్థులు, ఒకసారి 'స్వతంత్ర పార్టీ' అభ్యర్థి, మరోసారి ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. ఒకప్పుడు రాయదుర్గం కాంగ్రెస్ పార్టీ కంచుకోట. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అయినప్పటినుండి కాంగ్రెస్ రాయదుర్గం నియోజకవర్గంలో తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. 1983 సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ రాష్ట్రవ్యాప్తంగా విజయదుందుభి మోగించగా ఇటు తెలుగుదేశం, అటు కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కక ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన పాటిల్ వేణుగోపాల్ రెడ్డి రెండు పార్టీల అభ్యర్థులను ఓడించి విజయం సాధించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలో తన స్థానాన్ని బలపరచుకోగా 2012 ఎన్నికల సందర్భంగా ఆవిర్భవించిన వైసిపి అనంతరం జరిగిన మూడు ఎన్నికలలో రెండుసార్లు గెలుపు సాధించింది. రాయదుర్గం శాసనసభ్యులు జె తిప్పేస్వామి1973 సంవత్సరంలో మరణానంతరం 1975లో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరపున పయ్యావుల వెంకటనారాయణ గెలుపొందారు. 2009 ఎన్నికలలో కాంగ్రెస్ తరపున గెలిచిన ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో అనంతరం 2012లో జరిగిన ఉప ఎన్నికలో ఆయన వైసిపి తరపున తిరిగి గెలుపొందారు. ఇప్పటివరకు 17 మంది రాయదుర్గం నుండి శాసనసభకు ప్రాతినిధ్యం వహించగా 2014 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైన కాలవ శ్రీనివాసులు తొలుత ప్రభుత్వ చీఫ్ విప్ గాను, అనంతరం రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. రాయదుర్గం నుండి రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహించింది కాలవ శ్రీనివాసులు మాత్రమే. 1978లో కాంగ్రెస్ ఐ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందిన కెబి.చన్న మల్లప్ప రాష్ట్ర ఉన్ని సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. 2019లో వైసిపి తరపున గెలుపొందిన కాపు రామచంద్రారెడ్డి ప్రభుత్వ విప్‌గా పని చేశారు. రాయదుర్గం నుండి ఎమ్మెల్యేగా ఇంతవరకు మహిళా ప్రాతినిధ్యం లేదు. పాటిల్ వేణుగోపాల్ రెడ్డి ఒకసారి ఇండిపెండెంట్ గాను, రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంతేకాక ఎమ్మెల్సీ గాను, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగాను పనిచేశారు. కాపు రామచంద్రారెడ్డి ఉపఎన్నికతో కలిపి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బండి హులికుంటప్ప ఒకసారి కాంగ్రెస్ తరపున, మరోసారి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గెలుపొందిన ఎమ్మెల్యేలలో గురుమాల్ నాగభూషణం, బండి హులికుంటప్ప రాయదుర్గం పట్టణానికి చెందిన వారు కాగా మిగిలిన వారు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు. కాలవ శ్రీనివాసులు అనంతపురానికి చెందినవారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఎం హనుమాపురం గ్రామానికి చెందిన సూర్యనారాయణ రెడ్డి కర్నాటక రాష్ట్రం కురుగోడులో ఎమ్మెల్యే గాను, అదే గ్రామానికి, కుటుంబానికి చెందిన బసవరాజేశ్వరి ఎంపీగాను మంత్రిగాను ఎన్నికయ్యారు. డి. హిరేహాల్‌కు చెందిన హెచ్‌జి. రాములు కర్నాటక రాష్ట్రం గంగావతి నుండి ఎంపీగా గెలుపొందారు. నియోజక వర్గంలోని హనకనహాల్ గ్రామానికి చెందిన బి నారాయణ రెడ్డి, గురునాథరెడ్డి అనంతపురం ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గంలో ఒకసారి కాంగ్రెస్ పార్టీ తరపున, రెండుసార్లు వైసిపి తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రాయదుర్గం నియోజకవర్గంలోని ఉంతకల్లు గ్రామానికి చెందిన మెట్టు గోవిందరెడ్డి ఒకసారి టిడిపి తరపున ఎమ్మెల్యే గాను ఎమ్మెల్సీగాను గెలుపొందారు. అనంతరం ఆయన వైసిపిలో చేరి ఏపీఐఐసీ అధ్యక్ష పదవిని పొందారు. రాయదుర్గం పట్టణానికి చెందిన పూల నాగరాజు అనంతపురం జిల్లా పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. కర్నాటక సరిహద్దున గడినాడు ప్రాంతంలో ఉన్న రాయదుర్గంలోని ప్రజలకు కర్నాటక ప్రాంత సంస్కృతి సాంప్రదాయాలు జీవన విధానంతో అనుబంధం ఎక్కువగా ఉంది.

రాయదుర్గం రైల్వే స్టేషన్

రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం ఓటర్ల వివరాలు

పురుషులు	1,29,090.
స్త్రీలు	1,31,736
ఇతరులు.	33
మొత్తం.	2,60859
పోలింగ్ స్టేషన్లు	296

రాయదుర్గం తొలి ఎమ్మెల్యే నాగభూషణం

రాయదుర్గం నుంచి ఎక్కువ సార్లు గెలుపొందిన పాటిల్ వేగనుగోపాల్‌రెడ్డి

ఇప్పటి వరకు శాసనసభ ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులు వీరే...

క్రసం	సం	విజేత	పార్టీ
1	1952	గురుమాల్ నాగభూషణం	కాంగ్రెస్
2	1957	ఎన్ సి శేషాద్రి	కాంగ్రెస్
3	1962	లక్క చిన్నపరెడ్డి	కాంగ్రెస్
4	1967	తిప్పేస్వామి	స్వతంత్ర పార్టీ
5	1972	తిప్పేస్వామి	కాంగ్రెస్
6	1975	పి. వెంకటనారాయణ	కాంగ్రెస్
7	1978	కెబి చెన్నమలప్ప	కాంగ్రెస్ (ఐ)
8	1983	పాటిల్ వేణుగోపాల్ రెడ్డి	ఇండిపెండెంట్
9	1985	బండి హులికుంటప్ప	కాంగ్రెస్
10	1989	పాటిల్ వేణుగోపాల్ రెడ్డి	కాంగ్రెస్
11	1994	బండి హులికుంటప్ప	తెలుగుదేశం
12	1999	పాటిల్ వేణుగోపాల్ రెడ్డి	కాంగ్రెస్
13	2004	మెట్టు గోవిందరెడ్డి	తెలుగుదేశం
14	2009	కాపు రామచంద్రారెడ్డి	కాంగ్రెస్
15	2012	కాపు రామచంద్రారెడ్డి	వైసిపి
16	2014	కాలవ శ్రీనివాసులు	తెలుగుదేశం
17	2019	కాపు రామచంద్రారెడ్డి	వైసిపి

హిందూపురం ఎప్పటికీ నందమూరి పురమే...

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బాలకృష్ణ

విక్టరీ చిహ్నం చూపిస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎప్పటికీ నందమూరి పురమే అని ఎవరు ఎన్ని జిమ్మికులు చేసిన నందమూరి కుటుంబానికి ఈ ప్రాంత ప్రజల ఆశీర్వాదం ఉంటుదని సిట్టింగ్ ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి బాలకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హిందూపురం రూరల్ మండలం బాలపంల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో ఆయన పర్యటించి ప్రచారం చేపట్టారు. పంచ్ డైలాగులతో బాలయ్య ప్రసంగించారు. జగన్ దేనికి సిద్ధమంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. జగన్ ప్రజానాయకుడిని అంటూ నయవంచకుడిగా మారాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.

కూటమిదే అధికారం : ఇక్బాల్

వచ్చే ఎన్నికల్లో కూటమి 140 నుంచి 150 సీట్లతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. ఈ బమేరకు ఆయన పలు వార్డులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. వైసిపి పాలనతో ప్రజలు విసగి పోయారన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం మాడిన వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపికి కార్యకర్తలే బలం : పల్లె

మహిళా ఓటరుతో మాట్లాడుతున్న పల్లె

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

తన తుది శ్వాస ఉన్నంతవరకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానుల కోసం పోరాడుతానని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆన గురువారం కొత్తచెరువు మండల పరిధిలోని తలమర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగుదేశం నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఐదేళ్ల పాలనలో తలమర్ల గ్రామంలో వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. అనంతరం గ్రామంలో పలువురు టిడిపిలోకి చేరారు. వారికి పల్లె టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు రామకష్ణ, శ్రీనివాసులుతో పాటు అధికసంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు టిడిపితోనే సాధ్యమని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. ఈసందర్భంగా టిడిపి నాయకులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా సామకోటి ఆదినారాయణ మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో యువత ఉద్యోగ అవకాశాలు లేక అనేక అవస్థలు పడ్డారన్నారు. యువత భవిష్యత్తు గాడిలో పడాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ యువ నాయకులు రామ్ లక్ష్మణ్ సోదరులు, బెస్త నవీన్, చెన్నప్ప, పుట్ల పోతన్న, చంద్ర, యంగముని, చంద్ర స్వామి, గంగరాజు, చాకలి సత్తి, రమేష్, వెంకటాద్రి, రమణ, కులమాలి కేశప్ప, శివ, తదితరులు పాల్గొన్నారు.

13 నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

నామినేషన్లకు చివరి రోజు కావడంతో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. టిడిపి నుండి కందికుంట వెంకటప్రసాద్ 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కందికుంట సతీమణి యశోదా దేవి 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.వైసిపి నుండి మక్బూల్ 1 సెట్ నామినేషన్ దాఖలు చేశారు.ఇండియన్ కాంగ్రెస్ పార్టీ తరపున కొండకమర్ల శానావ్స్ , ఇండిపెండెంట్లుగా ఆరుగురు నామినేషన్లు వేశారు.రాడికల్స్ పార్టీ నుండి 1 నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్ బాధితులే

టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్

నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న కందికుంట, తదితరులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసీపీ ప్రభుత్వంలో అన్ని విధాలా నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే ప్రజలు కూటమికి అవకాశం ఇవ్వాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నామినేషన్లకు చివరిరోజు గురువారం కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి యశోదా దేవి తో కలసి కదిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వంశీకృష్ణకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కందికుంట విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో అన్ని వర్గాల ప్రజలు జగన్మోహన్ రెడ్డి బాధితులేని అని విమర్శించారు. ఈ ఎన్నికలు ప్రజలకు చారిత్రకమైన అవసరమన్నారు. 20 సంవత్సరాలుగా ప్రజా జీవితంలో ఉన్నానని కష్టం వచ్చిన నష్టం వచ్చిన అండగా నిలబడిన తనకు అవకాశం కల్పించాలని నియోజకవర్గ ఓటర్లను కోరారు.

నామినేషన్ల తీరుపై ఆరా తీస్తున్న వ్యయ పరిశీలకులు షిండే

'అనంత' ఎన్నికల వ్యయ పరిశీలకుడి పర్యటన

రాయదుర్గం : అనంతపురం పార్లమెంటు లోకసభ ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి షిండే గురువారం రాయదుర్గంలో పర్యటించారు. ముందుగా తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించి నామినేషన్ల తీరుపై ఆర్ఒ కరుణకుమారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాతీయ రహదారి-544డిడి గాలి మారెమ్మ దేవస్థానం వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్, గుమ్మఘట్ట మండలంలోని సిరిగేదొడ్డి వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌లను తనిఖీ చేశారు. ఈ మార్గంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో పాటు లైజన్ ఆఫీసర్ వి.శంకర్ ఉన్నారు.

ఇంటింటి ప్రచారంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెలుగుతమ్ముళ్లు

టిడిపి నాయకుల విస్తృత ప్రచారం

రొద్దం : పెనుకొండ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే సవితమ్మకు మద్దతుగా గురువారం టిడిపి నాయ కులు మండలంలోని చిన్నకోడిపల్లి, ఆర్.మరవపల్లి, రొద్దకంపల్లి, తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వారు ఇంటింటికీ వెళ్లి బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్‌సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అలాగే వైసిపి ప్రభుత్వ వైఫ ల్యాలు, అరాచక పాలన గురించి ఓటర్లకు వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నా ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సవితమ్మను, ఎంపిగా బికె.పార్థసారధిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, చిన్నప్పయ్య, మాధవనాయుడు, చంద్రమౌళి, అశ్వర్థనారాయణ, నరసింహులు, క్రిష్టప్ప, నాగరాజు, హరీష్, రుద్ర, నారాయణ పాల్గొన్నారు.

వైసిపి నేత నర్సింహులు టిడిపిలో చేరిక

కదిరి టౌన్ : నల్లచెరువు మండలంలోని కె.పూలకుంట పంచాయతీకి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు నాస్ నర్సింహులు గురువారం కదిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టిడిపిలో చేరారు. మండలంలోనే అతి చిన్న పంచాయతీగా పేరొందిన కె.పూలకుంట పంచాయతీలో నాస్ నరసింహులుకు ప్రత్యేకత ఉంది. ఈయన స్థానిక రాజకీయాల్లో కీలకమైన వ్యక్తిగా ఉన్నారు. ఈ పంచాయతీలో రెండుసార్లు సర్పంచులు గెలవడానికి ముఖ్య కారకుడు. ప్రజలతో సత్సం బంధాలు ఉన్నాయి. అలాంటి వ్యక్తి చేరడంతో మండలంలో టిడిపి బలం మరింత పెరిగినట్లు అయింది.

సవితమ్మ సమక్షంలో పలువురు..

రొద్దం : మండలంలోని గోనిమేకలపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు ఎం.నాగరాజు, కె.నాగరాజు, రామాంజనేయులు, కె.రవి, గురుమూర్తి తదితరులు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వారికి పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ టిడిపి కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు హరీష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సవితమ్మ

మళ్లీ వైసిపిదే అధికారం : ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం తిరిగి అధికారంలోకి వచ్చేది జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వమేనని ఆ పార్టీ రాయదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం నామినేషన్ వేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి అధినేత తనపై గురుతర బాధ్యత పెట్టారని, గెలిపిస్తే నిస్వార్థంగా రాయదుర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బిటి ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకొస్తానని లేకుంటే రాజకీయ సన్యాసం చేస్తానన్నారు. చంద్రబాబు పాలనలో బిటి ప్రాజెక్టుకు ఎలాంటి నిధులు విడుదల చేయలేదన్నారు. జగన్ ఎత్తిపోతల పథకానికి రూ. 208 కోట్లు విడుదల చేశారన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న నియోజకవర్గ ప్రజలు నామినే షన్ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షణీయమన్నారు. గెలిచిన ఏడాదిలోగా రాయదుర్గంలో అభివృద్ధి చేసి చూపుతానన్నారు. గార్మెంట్స్ పరిశ్రమను అభివృద్ధి చేస్తానని, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. వేదురు పంట సాగుతో పాటు ఇథనాల్, సోలార్ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. 40 చెరువులకు నీరందిస్తానన్నారు. ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ నిర్మాణ సాధ్యా సాధ్యాలను పరిశీలిస్తామన్నారు. కాలవ శ్రీనివాసులు నియోజకవర్గానికి చేసింది శూన్యం అన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

వక్కలిగల తరఫున స్వతంత్ర అభ్యర్థిగా పోటీ

హిందూపురం ఎంపి అభ్యర్థి కెవిఎన్ పల్లి సురేష్

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గంలో దాదాపు 80 వేలకు పైగా ఉన్న వక్కలిగ సామాజిక వర్గానికి ఏ పార్టీ రాజకీయంగా అవకాశం కల్పించకపోవడంతో హిందూపురం పార్లమెంటు స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు కెవిఎన్ పల్లి సురేష్ తెలిపారు. గుడిబండ మండలంలోని కెవిఎన్.పల్లి గ్రామానికి చెందిన సురేష్ గురువారం హిందూపురం ఎంపి స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మడకశిర టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న తనయుడు డాక్టర్ సునీల్‌కుమార్‌ను తొలుత ప్రకటించిన చంద్రబాబు ఆ తర్వాత స్థానికేతరుడైన ఎంఎస్.రాజుకు బీ ఫారం ఇవ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీనికంతటికీ కారణమైన ఎంపి అభ్యర్థి బికె పార్థసారధికి ఈ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధమై నియోజకవర్గంలో అత్యధిక శాతం జనాభా ఉన్న కుంచిటి వక్కలిగ సామాజిక వర్గానికి చెందిన తాను హిందూపురం ఎంపి స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధమయ్యానన్నారు. కార్యక్రమంలో ఉగ్రనరసింహ, రామకృష్ణయాదవ్, లెజెండ్ సుధాకర్, జయరామిరెడ్డి, మారుతి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంపి స్వతంత్ర అభ్యర్థి సురేష్

ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్ తనిఖీ

లేపాక్షి : మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను గురువారం ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సందర్శించి స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి బందోబస్తు వివరాలను తెలిపారు. అనంతరం స్థానిక దుర్గావీరభద్రస్వామి, నంది ఆలయాలను సందర్శించారు. ఆయన వెంట డీఎస్పీ కంజాక్షన్, సిఐ ఈరన్న, ఎస్ఐ గోపి ఉన్నారు.

డి.హీరేహాళ్ నుంచి 'మెట్టు' నామినేషన్‌కు బయల్దేరిన వైసిపి శ్రేణులు

'మెట్టు' నామినేషన్‌కు తరలిన వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి-బొమ్మనహాళ్

రాయదుర్గం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గురువారం నామినేషన్ వేస్తున్న సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు వివిధ వాహనాల్లో భారీగా రాయదుర్గం తరలివెళ్లారు. వైసిపి మండల కన్వీనర్ రామాంజనే యులు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు వాహనాలకు వైసిపి జెండాలు కట్టుకొని జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా బయల్దేరి తరలివెళ్లారు. రామాంజనేయులు మాట్లాడుతూ వైసిపి అధినేత జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు సింగేపల్లి కృష్ణ, శ్రీధర్‌ఘట్ట యోగేశ్వర్‌రెడ్డి, నేమకల్లు పరమేశ్వర, ఉంతకల్లు ముక్కన్న, హరేసముద్రం తిప్పేస్వామి, సిద్ధరాంపురం ఆంజనేయులు తరలివెళ్లారు.

డి.హీరేహాళ్ : రాయదుర్గం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి నామినేషన్ కార్యక్ర మంలో పాల్గొనేందుకు డి.హీరేహాళ్ నుంచి వైసిపి నాయకులు భారీగా రాయదుర్గం తరలివెళ్లారు. వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచులు బోయ మల్లికార్జున, శ్రీనివాస్‌రెడ్డి, కళ్లెం నాగరాజు, హనుమంతరెడ్డి, నాయకులు రహంతుల్లా, జగదీష్, పుల కుర్తి చంద్ర, కళ్యాణ్, సురేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో బయల్దేరి వెళ్లారు.

పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి పట్టణంలో ఈ నెల 27వ తేదీ నిర్వహిస్తున్న పాలిసెట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిం చాలని కదిరి పాలిసెట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నారాయణ ఆదేశించారు. పాలిసెట్ నిర్వహణపై శుక్రవారం కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1,669 మంది విద్యార్థుల కోసం పట్టణంలో 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎస్‌టి ఎస్ఎన్, ప్రభుత్వ బాలుర పాఠశాల, బాలికల జూనియర్ కాలేజ్, ఎస్ఎంజెఎల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, బాల్ పాయింట్ పెన్, హెచ్‌బి పెన్సిల్ తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని నిర్వహణ అధికారులకు సూచించారు. విద్యార్థులను ఉదయం 10 గంటలకే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకునేందుకు అవసరమైన బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కోరారు. సమావేశంలో పరీక్ష కేంద్రాల సిఎస్‌లు, రూట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కర్నాటక వాసి మృతి

ప్రజాశక్తి-రాయదుర్గం

డి.హీరేహాల్ మండలంలోని జాజర్కల్ టోల్ ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నాటకకు చెందిన నందీష్(32) మృతి చెందాడు. కర్నాటకలోని మండ్యా జిల్లాకు చెందిన చేతన్, సుతాన్, జగదీష్, శాంతికుమార్, నందీష్ బెంగళూరులోని ఇండిక్యూబ్ సంస్థలో పని చేస్తున్నారు. వీరు రాఘవేంద్రస్వామి దర్శనం కోసం కారులో మంత్రాలయం వెళ్తుండగా టోల్ ప్లాజా సమీపంలో ఐటుకల లోడుతో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. దీంతో కారు ట్రాక్టర్ ట్రాలీ కింద ఇరుక్కుపోయింది. ఇది గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ కారును కొంతదూరం వరకూ లాక్కుని వెళ్లడంతో వారిలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని బళ్లారి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ నందీశ్ మృతి చెందాడు. ప్రమాదంపై డి.హీరేహాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యాధుల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే వ్యాధుల పట్ల అవగాహన ఎంతో అవసరమని యనమలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ జోష్న సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా యనమలపల్లి పిహెచ్‌సి వద్ద నుంచి స్థానిక గణేష్ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, ప్రతి ఫ్రైడేను డ్రై డేగా పాటించాలని సూచించారు. కార్యక్రమం లో సిహెచ్ఒ నగేష్, పిహెచ్ఎన్ లలితకుమారి, ఎస్‌యుఒ రమణయ్య, సూపర్ వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ రాజకుమార్ మలేరియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యం త ప్రమాదకారి దోమ అని, దోమల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలు సంభవి స్తున్నాయన్నారు. కావున ప్రజలు దోమ నివారణ చర్యలను పాటించాలన్నారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, భాగ్యలక్ష్మి, సూపర్వైజర్ రమాదేవి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీఉల్లా ఆధ్వర్యంలో కదిరేపల్లి పిహెచ్‌సిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలో భాగంగా దోమ కుట్టకూడదు-దోమ పుట్టకూడదు, దోమల వ్యాప్తిని అరికడదాం అంటూ ప్ల కార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బంది మానవహారంగా ఏర్పడి ప్రజల కు మలేరియా నివారణపై అవగాహన కల్పించా రు. వైద్యాధికారి డాక్టర్ లికిత మాట్లాడుతూ మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు మాట్లాడుతూ సిబ్బంది హెల్త్ క్లినిక్‌ల పరిధిలోని గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ లిఖిత, ఎంపిహెచ్ఇఒ రమణ, సూపర్‌వైజర్ రాణి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : మలేరియాపై అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్ : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని శ్రీధర ఘట్ట, దర్గా హొన్నూరు, బొమ్మనహాళ్ పిహెచ్‌సి ల వైద్య సిబ్బంది గ్రామాల్లో మలేరియా నివారణ పై ర్యాలీ నిర్వహిం చారు. వీధుల్లో తిరుగుతూ ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. మురుగు నీరు నిల్వ ఉండరాదని, సాయంత్రం వేళ వేపాకు పొగ వేసుకోవాలని, రాత్రివేళ దోమతెరలు వాడాలని సూచించారు. దోమలను నివారించి రోగాల నుంచి కాపాడుకో.. అని ర్యాలీలో నినాదాలు చేశారు.

'అభ్యర్థి మార్పు బాధ కలిగించింది'

'ఆత్మీయ నేస్తం'లో మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సునీల్‌కుమార్

ప్రజాశక్తి-మడకశిర

టిడిపి అధిష్టానం మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థిగా తన కుమారుడైన డాక్టర్ సునీల్‌కుమార్‌ను తప్పించడం బాధ కలిగించిందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని డిహెచ్‌పిఎస్ కార్యాలయంలో గురువారం దళిత నాయకులు 'ఆత్మీయ నేస్తం' పేరుతో సమావేశం నిర్వహించారు. ముందుగా డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపకులు హనుమంతు ఆధ్వర్యంలో డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న మాట్లాడుతూ టిడిపి బలోపేతం కోసం 20 ఏళ్లుగా కృషి చేయగా అధిష్టానం గుర్తించి నా కుమారునికి ఎమ్మెల్యే టికెట్ కేటాయించిందన్నారు. అయితే కొందరు స్వార్థపరుల మాటలు విని, వారి కుట్రలు గమనించకుండా సునాయాసంగా గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నా పట్టించుకోకుండా బీ ఫామ్‌ను స్థానికేతరుడైన ఎంఎస్ రాజుకు ఇవ్వడం బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించగానే డాక్టర్ వృత్తిని పక్కనపెట్టి కష్టనష్టాలను ఎదుర్కొని ప్రజల్లోకి వెళ్లి మడకశిరలో టిడిపి గెలుపు ఖాయమనే స్థాయికి తీసుకొచ్చా నన్నారు. మడకశిరలో టిడిపి జెండా ఎగురవేయాలనే ఉద్దేశంతో పార్టీ ఆదేశాల మేరకు గుండుమల తిప్పేస్వామిని పలుమార్లు కలిశాను. అయినా బికె పార్థసారధి, గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాస మూర్తి కుట్ర పన్ని బి ఫామ్‌ను నాన్ లోకల్ వ్యక్తి అయిన ఎంఎస్ రాజుకు ఇప్పించారని వాపోయారు. హనుమంతు మాట్లాడుతూ ఇకపై ఏ ఒక్క దళితునికి అన్యాయం జరిగినా మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. టిడిపి రెబల్ అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్‌కి డిహెచ్‌పిఎస్, రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అండగా ఉంటుందని తెలిపారు. సమావేశంలో హైకోర్టు అడ్వకేట్, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు హెచ్.శివరామకృష్ణ మాట్లాడుతూ దళితులను అడ్డం పెట్టుకుని అక్రమంగా సంపాదించిన కొందరు పెత్తందారులకు బుద్ధి చెప్పాలని కోరారు. నియోజకవర్గం లోని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలందరూ ఐకమత్యంతో సునీల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్, చిత్రంలో ఈరన్న

ఆర్ఓ అపూర్వభరత్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఉషశ్రీ చరణ్

పెనుకొండలో 11 మంది అభ్యర్థులు.. 25 నామినేషన్లు

ప్రజాశక్తి -సోమందేపల్లి

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం నాటితో నామినేషన్ల పర్వం ముగిసింది. పెనుకొండ అసెంబ్లీ స్థానానికి మొత్తం 11 మంది అభ్యర్థులు 25 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం ఒక్క రోజే పెనుకొండ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బిఎస్‌పి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదినారాయణ, వైసిపి తరపున ఉషశ్రీచరణ్, కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పి.నరసింహప్ప, జై భీమ్ పార్టీ నుంచి ఎన్.నాగరాజు, టిడిపి అభ్యర్థులుగా సవితమ్మ, కురుబ రవికుమార్, స్వతంత్ర అభ్యర్థులుగా మహేష్, ఏ.నరసింహులు, సుగాలి గణేష్‌నాయక్, ఈ.నరేంద్ర, హబీబ్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అపూర్వ భరత్‌కు అందజేశారు.

ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న అమిలినేని సురేంద్రబాబు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఆయన నామినేషన్ ప్రక్రియ గురువారం అట్టహాసంగా సాగింది. నామినేషన్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి రావడంతో ప్రజా వేదిక నుంచి ఎన్టీఆర్ భవన్ వరకూ రోడ్లు పసుపుమయం అయ్యాయి. ముందుగా ఆయన వాల్మీకి, మహాత్మగాంధీ, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్ఓ రాణి సుస్మితకు నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, వైపి.రమేష్, గోళ్ల సర్పంచి కవితా బొజ్జన్న, గొల్ల వెంకటేశులు పాల్గొన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

పెనుకొండ వైసిపి అభ్యర్థి ఉషశ్రీచరణ్.. జనప్రభంజనం నడుమ నామినేషన్

ప్రజాశక్తి-సోమందేపల్లి

వైసిపి అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం అభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమని పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెవి.ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. ఆమె గురువారం పెనుకొండ పట్టణంలోని ఆలయాలు, దర్గా, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి అనంతరం తన క్యాంప్ కార్యాలయం వద్ద నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి జన ప్రభంజనం మధ్య భారీ ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని భర్త శ్రీచరణ్‌రెడ్డి, వైసిపి నాయకులు శివారెడ్డి, తదితరులతో కలిసి ఎన్నికల రిటర్నింటంగ్ అధికారి అపూర్వభరత్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం అంటేనే వైసిపి అన్నారు. రాష్ట్రంలో జగన్ సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నారన్నారు. నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో పెనుకొండ జన సంద్రంగా మారిందని తెలిపారు. తనను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని వంద శాతం అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా తాగు, సాగు నీరు అందిస్తా మన్నారు. ఐటి హబ్‌గా అభివృద్ధి చేస్తానన్నారు. పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తాన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలు వేస్తామని తెలిపారు. మెడికల్ కళాశాలను 7 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

నామినేషన్ వేసుందుకు ర్యాలీగా వెళ్తున్న ఉషశ్రీచరణ్ దంపతులు

ఇఆర్ఓ గౌరీశంకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సుధాకర్

కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్ నామినేషన్

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్ గురువారం నామినేషన్ వేశారు. ముందుగా సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఉదయమే నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా పట్టణానికి చేరుకున్నారు. స్థానిక హిందూపురం రోడ్డు నుంచి ప్రచార రథంపై రఘువీరా, సుధాకర్ నిల్చొని ప్రజలకు అభివాదం చేస్తూ తహశీల్దార్ కార్యాలయం సమీపం లోకి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కె.సుధాకర్ రఘువీరాతో కలిసి వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

అట్టహాసంగా 'మెట్టు' నామినేషన్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గురువారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తొలుత తన నివాసంలో సర్వమత ప్రార్థనలు జరిపి అనంతరం శాంతినగర్ బన్నీ మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనంతపురం ఎంపి అభ్యర్థి మాలగుండ్ల శంకరనారాయణ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, పార్టీ పరిశీలకులు పామిడి వీరాంజనేయులు, రాయదుర్గం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, పార్టీ శ్రేణులతో కలిసి నామినేషన్ వేసేందుకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో బయల్దేరారు. శాంతినగర్ నుంచి ర్యాలీగా బళ్లారి రోడ్డు, వినాయక కూడలి, లక్ష్మీబజార్ మీదుగా పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కరుణకుమారికి మెట్టు గోవిందరెడ్డి నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకుముందు వినాయక కూడలిలో అభిమానులు భారీ గజమాల వేశారు. ఎంపి అభ్యర్థి శంకర నారాయణ మాట్లాడుతూ వైసిపికి ప్రజల్లో మంచి ఆదరణ ఉందని, అనంతపురం జిల్లాలో 7 అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంటును కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణంతో పాటు నియోజకవర్గం వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

నామినేషన్ వేసుందుకు ర్యాలీగా వెళ్తున్న మెట్టు గోవిందరెడ్డి

ఆర్ఓ కరుణకుమారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మెట్టు

రాయదుర్గంలో 17 మంది అభ్యర్థులు.. 29 సెట్ల నామినేషన్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం అసెంబ్లీ స్థానానికి మొత్తం 17 మంది అభ్యర్థులు 29 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజైన గురువారం 9 నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి కరుణకుమారి తెలిపారు. వైసిపి నుంచి మెట్టు గోవిందరెడ్డి 4 సెట్లు, టిడిపి తరపున కాలవ శ్రీనివాసులు 4 సెట్లు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎంబి చిన్నప్పయ్య 3 సెట్లు, భారత చైతన్య యువజన(బిసివై)పార్టీ అభ్యర్థిగా గౌని ప్రతాపరెడ్డి 2 సెట్లు, మెట్టు విశ్వనాథరెడ్డి వైసిపి తరపున 2 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా కావలి శ్రీనివాసులు 2, కురుబ శ్రీనివాసులు 2 సెట్ల నామినేషన్లు వేశారు. ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా డి.వరలక్ష్మి, టిడిపి తరపున కాలవ విజయలక్ష్మి, బహుజన సమాజ్ పార్టీ తరపున చిందనూరు నాగరాజు, గౌని ఉషారాణి, ఉండల రామచంద్రారెడ్డి, హరిజన రంగనాథ్, గోవిందు, బళ్లారి గోవింద, కావలి శ్రీనివాసులు ఒక సెట్ చొప్పున నామినేషన్లు వేశారు.

ఇఆర్ఓ గౌరీశంకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిర స్వతంత్ర అభ్యర్థిగా ఈరన్న నామినేషన్

మడకశిర : మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి మాజీ ఎమ్మెల్యే ఈరన్న నామినేషన్ దాఖలు చేశారు. ఆయన గురువారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయనతో పాటు పాండురంగప్ప, ఆదినారాయణ, రవిభూషణ్, శక్తి ముని ఉన్నారు.

నేటి నుంచి టిడిపి అభ్యర్థి ఎంఎస్ రాజు ఎన్నికల ప్రచారం

మడకశిర : మడకశిర నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు శుక్రవారం నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఎంఎస్ రాజు శుక్రవారం చందకచెర్ల, గౌడనహళ్లి, ఛత్రం, ఆర్.అనంతపురం, సి.కొడిగేపల్లి, బుల్లసముద్రం, కల్లుమర్రి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని, టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

టిడిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడి నామినేషన్

మడకశిర : టిడిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మద్దనకుంటప్ప, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, గుణే మోరుబాగల్ సర్పంచి నారాయణప్ప, ఐటిడిపి ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌తో కలిసి ఎన్నికల అధికారి కార్యాలయం వెళ్లి ఆర్ఓ గౌరీశంకర్‌కి ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు.

ఆర్ఓ గౌరీశంకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మంజునాథ్

పలువురు నామినేషన్ల దాఖలు

నామినేషన్ దాఖలు చేస్తున్న శైలజానాథ్

శింగనమల : వచ్చే ఎన్నికల్లో ఆదరిస్తే అభివృద్ధి చేసి చూపుతానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సాకే శైలజానాథ్ అన్నారు. గురువారం భారీ జనసందోహం మధ్య స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. ముందుగా కొత్త మరువకొమ్మ నుంచి పాత మరువకొమ్మ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఐ నారాయణస్వామితో కలిసి తన నామినేషన్ ప్రతాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. అప్పటి నుంచి నియోజవకర్గం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. మళ్లీ కూడా అభివృద్ధి జరగాలంటే తిరిగి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొమ్మలాటపల్లి నరసింహారెడ్డి, రామ్‌చరణ్‌యాదవ్, సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, సిపిఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చెన్నప్పయాదవ్, నాయకులు నేసే మధు, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ వేసేందుకు వస్తున్న కె.ప్రభాకర్

గుంతకల్లు : ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థిగా కె.ప్రభాకర్ గురువారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందుతో కలిసి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయానికి చేరుకుని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ వేసేందుకు వస్తున్న వై.వెంకటరామిరెడ్డి

అలాగే అశేష జనవాహిని మధ్య వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.వెంకటరామిరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా స్థానిక మస్తాన్‌వలి బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడి నుంచి డిజె, బాణాసంచా మోతలతో భారీ ర్యాలీగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు కూడలిలో అభిమానులు గజమాలతో సన్మానించారు. తర్వాత కసాపురం రోడ్డులోని వాల్మీకి నగర్ వరకూ వచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు మరలా తనను ఎమ్మెల్యే చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి ఎన్ని జిమ్మిక్కులు చేసినా గుంతకల్లు ప్రజలు నమ్మరన్నారు. గుమ్మనూరు జయరామ్‌ను చిత్తుగా ఓడిస్తారన్నారు.

నామినేషన్ వేసేందుకు వస్తున్న శ్రావణిశ్రీ

శింగనమల/బుక్కరాయసముద్రం : భారీ జనసందోహం మధ్య టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా అనంతపురంలోని తన నివాసం నుంచి బయలుదేరి బుక్కరాయసముద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులతో కలిసి భారీ కాన్వాయ్‌తో శింగనమలకు చేరుకున్నారు. మండల కేంద్రం సమీపంలోని కొత్త మరువకొమ్మ నుంచి నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. పాత మరువకొమ్మ నుంచి ఎద్దుల బండిపై తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, లాయర్ ఈశ్వర్‌రెడ్డి, బండారు లీలావతితో కలిసి నామినేషన్ పత్రాలను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీనుకు అందించారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు పర్వతనేని శ్రీధర్‌బాబు, రామలింగారెడ్డి, పసుపుల హనుమంతురెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అట్టే రామాంజనేయులు, అట్టే శ్రీనివాసులు, పుల్లయ్య, నాగేంద్ర, రాచేపల్లి లక్ష్మీనారాయణ, అట్టే శంకరయ్య, పెద్దమట్లగొంది టిడిపి సర్పంచి పార్నపల్లి రమేష్, భారీ సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భయపడొద్దు..అండగా ఉంటా..

టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-పామిడి

మహిళలతో మాట్లాడుతున్న గుమ్మనూరు జయరామ్

'మీకు ఏ సమస్య వచ్చినా భయపడాల్సిన అవసరం లేదు.. మీకు అండగా నేనున్నా' అంటూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ భరోసా ఇచ్చారు. గురువారం మండలంలోని నెమళ్లపల్లి, వంకరాజుకాలువ, సొరకాయలపేట, ఎద్దులపల్లి, పాల్యం, అప్పాజీపేట గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా వంకరాజుకాలువలో వైసిపి నుంచి 40 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా జయరామ్ మాట్లాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రజలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన దాదాపు 150 వైసిపి కుటుంబాలు గురువారం టిడిపిలో చేరాయి. ఈ సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరామ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను తిప్పికొట్టండి

వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వై.విశ్వేశ్వరరెడ్డి, శంకరనారాయణ

ప్రజాశక్తి-వజ్రకరూరు

వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు మోసాలను ప్రజలు తిప్పి కొట్టాలని ఉరవకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. గురువారం కూడేరు మండలం జల్లిపల్లి, ఉదిరిపికొండ, శివరామ్‌పేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను వందశాతం అమలు చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కొందరికే అందాయని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక కులం, మతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించామన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కాగా జల్లిపల్లి గ్రామంలో గ్రామ యువత గజమాలతో ఘన స్వాగతం పలికింది. ఈ కార్యక్రమంలో మండల, ఆయా గ్రామాల వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి ప్రచారం

విడపనకల్లు మండలం కరకముక్కలలో వై.విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి భువనేశ్వరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, నాయకురాళ్లు రోజా, మహేశ్వరి, పార్వతమ్మ, చంద్రమ్మ, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరరెడ్డికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

బెలుగుప్ప : వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డిని గెలిపించాలని మండల వైసిపి నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల కేంద్రంలో వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.శివలింగప్ప, పి.శ్రీనివాసులు, సాలీబాయి, ఈశ్వరప్ప, కరుణాకర్, తిమ్మారెడ్డి, బాబురెడ్డి, గాజుల రాము, పాతన్న, వెంకటేశులు, తిప్పేస్వామి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పలువురు వైసిపిలో చేరిక

ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గురువారం వైసిపిలో చేరారు. వీరికి రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అమిలినేని అనిల్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజా సేవకు మళ్లీ అవకాశమివ్వండి

తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఒక్కసారి అవకాశమిస్తే ఎన్నో అభివృద్ధి పనులు చేశా.. ప్రజా సేవకుడిగా మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతానని రాప్తాడు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో అనంతపురం నగర శివారులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చామన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చామన్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాల వల్ల ప్రతిఇంటికీ లబ్ధి చేకూరిందన్నారు. టిడిపి జెండాలు మోసిన వాళ్లు కూడా సంతోషంగా ఉన్నారన్నారు.పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నంటి నడిచిన ప్రతి కార్యకర్త, నాయకుడికీ రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గంలో అమ్మ డెయిరీ ద్వారా మహిళా పాడి రైతులకు ఉపాధి కల్పించామన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ అంతరించిపోయి శాంతి కుసుమాలు పూస్తున్నాయన్నారు. ప్రజాసేవతో 50వేల మెజారీతో గెలిచి మళ్లీ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమయంలో చంద్రబాబు మోసపూరిత హామీలు, పరిటాల కుటుంబాన్ని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

కమ్యూనిస్టు సీనియర్ నేత సుబ్బిరెడ్డి మృతి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మృతిచెందిన సుబ్బిరెడ్డి (ఇన్‌సెట్‌లో పాతచిత్రం)

సీనియర్ కమ్యూనిస్టు నాయకులు సుబ్బిరెడ్డి (88) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. యల్లనూరు మండలం వెన్నుపూసపల్లి గ్రామానికి చెందిన సుబ్బిరెడ్డి చిన్న వయస్సు నుంచే కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తూ వచ్చారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో కొనసాగిన ఆయన వామపక్ష పార్టీలు విడిపోవడంతో తర్వాత సిపిఎంలో కొనసాగారు. తరిమెల నాగిరెడ్డి హయాంలో పార్టీతో విభేదించి మావోయిస్టు పార్టీపై మక్కువతో ఆనాడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని డార్జిలింగ్ జిల్లాలోని నక్సల్ బరిలో చేరారు. ఇందులో భాగంగా వెన్నపూసపల్లి గ్రామంలో నక్సల్ బరి సంఘీభావ కమిటీని సైతం ఏర్పాటు చేశారు. 1975లో ఎమర్జెన్సీ విధించడంతో హైదరాబాదులోని ముషీరాబాద్ జైల్లో 18 నెలలు గడిపారు. ఈయనతోపాటు రమణారెడ్డి, వరవరరావు, సూర్యనారాయణరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తదితరులు నిర్బంధంలో ఉన్నారు. సుబ్బిరెడ్డి నిరంతరం నాస్తికుడిగా జీవిస్తూ కమ్యూనిస్టు పుస్తకాలను అధ్యయనం చేసి చివరి వరకూ కమ్యూనిస్టు ఆలోచనలతోనే తన ప్రయాణాన్ని కొనసాగించారు. అనేక ఆర్థిక సమస్యలు వచ్చినప్పటికీ రాజీలేని జీవితాన్ని కొనసాగించారు. సుబ్బిరెడ్డి మృతి విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి గ్రామానికి చేరుకుని పార్థీవదేహంపై కమ్యూనిస్టు జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం రైతుసంఘం ఆధ్వర్యంలో వెన్నపూసలపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

టిడిపిని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడదాం

పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

మహిళలతో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిని గెలిపించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడదామని ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. గురువారం వజ్రకరూరు మండల పరిధిలోని ధర్మపురి, చాబాల, పొట్టిపాడు, ఛాయాపురం, కమలపాడు, గుళపాళ్యం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపిలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపిని ఆదరించి గెలిపించాలని కోరారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మలేరియాను నివారిద్దాం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మలేరియాను పూర్తి స్థాయిలో నివారించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో మలేరియా నివారణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న దోమతో పెద్ద ప్రమాదం పొంచి ఉందన్నారు. మలేరియా ప్రాణాంతక మైనదన్నారు. నిలువ ఉన్న మురికి, మురుగు నీటిలో లార్వాలుగా ఎదిగి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. దోమలు వ్యాప్తి చెంది అవి కుడితే మలేరియా వ్యాపిస్తుందన్నారు. దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమల్ రోహిత్, మనోహర, విజయకుమారి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట : అంతర్జాతీయ మలేరియా నివారణ సందర్భంగా గురువారం నాడు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. 'దోమ పుట్టకూడదు.. దోమ కుట్టకూడదు'.. నినాదాలతో నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా నిర్వహించినట్లు వైద్యాధికారులు మహేశ్వరం మారుతి ప్రసాద్, ఫక్రుద్దీన్ తెలిపారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రతను పాటించాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుంటే మలేరియాను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని మలక వేముల క్రాస్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని డాక్టర్ నాగేంద్ర నాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. ఈ కార్యక్రంలో వైద్య సిబ్బంది లక్ష్మీ నరసమ్మ ,వేణు గోపాల్ రెడ్డి, రవి శంకర్, జ్యోతి, సుజాత, జ్యోతి, వినయ్, బాషా, హరినాథ్ రెడ్డి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

హిందూపురం : ప్రపంచ మలేరియా దినోత్సవంలో భాగంగా పట్టణంలోని బోయపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది బోయపేట తదితర ప్రాంతాలలో అవగాహనార్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు అయిషా తస్లీమ్, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎన్ శివన్న, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఎనుములపల్లి ప్రభుత్వ వైద్యశాల లో వైద్యురాలు జోత్స్న, సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని వారు కోరారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నగేష్, పిహెచ్ఎన్ లలిత కుమారి, ఎన్‌యుఒ రమణయ్య, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కామ్రేడ్ రఘునాథ్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

కామ్రేడ్ రఘునాథ్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు ముందుడి పోరాటం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ అన్నారు. ప్రీకాట్ మిల్లులో విధులు నిర్వహించిన విశ్రాంత కార్మికుడు కామ్రేడ్ రఘునాథ్ రెడ్డి బుధవారం గుండె పోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఎం, సిఐటియు నాయకులు గురువారం పట్టణంలోని సడ్లపల్లిలో మృతిని ఇంటికి వెళ్లి రఘునాథ్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.. ఈ సందర్భంగా కామ్రేడ్ రఘునాథ్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని నినాదాలు చేశారు. అనంతరం ఇంతియాజ్ మాట్లాడుతు రఘునాథరెడ్డి నాలుగు సార్లు సిఐటియు తరపున మిల్లులో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికై కార్మికుల సంక్షేమం కోసం శ్రమించారన్నారు. మంచి నాయకుడిని సిఐటియు కోల్పోయిందని, ఆయన ఆశయ సాధన కోసం పనిచేస్తామని అన్నారు. మృతుని కుటుంబానికి సిఐటియు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, ప్రీకాట్ మిల్లు అధ్యక్షులు జయరామిరెడ్డి, నందీశ్వర, సదాశివరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి, సిఐటియు నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా అందరూ సహకరించాలని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి కోరారు. ధర్మవరం సబ్ డివిజన్ లోని సికేపల్లి మండలం, ధర్మవరం లోని సమసాత్మకమైన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ గురువారం పరిశీలించారు. ప్రజలు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లతోపాటు గ్రామాల్లోని పరిస్థితులను ఎస్పీ స్వయంగా ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. సికేపల్లి మండలం పులేటిపల్లి , వెంకటం పల్లి, మేడాపురం, ఎర్రగుంట, సమీపంలోని ఎల్ సి కె పురం, ధర్మవరంలోని మున్సిపల్ పాఠశాల మార్కెట్ యార్డ్, గూడ్స్ కొట్టాలు, మామిళ్ళపల్లి కామిరెడ్డిపల్లి , కలికివాండ్లపల్లి, రామగిరి సర్కిల్ ,తదితర ప్రాంతాలలో సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను స్థానిక పోలీస్ అధికారులతో ఆరాదీశారు. ఎక్కడా అల్లర్లు, గొడవలు, జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా కట్టుదిట్టంగా భద్రత ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ అధికారులకు సూచించారు. సమస్యలు ఏవన్నా ఉత్పన్నమైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్పీ ప్రజలను కోరారు.ఈ కారక్రమంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, సిఐలు సుబ్రహ్మణ్యం, అశోక్ ,శివ ఆంజనేయులు, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్, ఆయా మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫోన్ ద్వారా ఫిర్యాదు

జిల్లా ఎన్నికల పరిశీలకులు

కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఎన్నికల నిబంధనలను ఎవరైనా ఉల్లంఘిస్తే ఫోన్‌ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల పరిశీలకులు తెలిపారు. సత్యసాయి జిల్లాకు ఇద్దరు జనరల్ అబ్జర్వర్ల ను ఎన్నికల కమిషన్ నియమించింది. గురువారం స్థానిక కలెక్టరేట్లోనే జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబును ఆయన చాంబర్లో జనరల్ అబ్జర్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. మడకశిర హిందూపురం పుట్టపర్తి కదిరి నియోజకవర్గాలకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా కర్నాటక రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి వి అన్బుకుమార్, రాప్తాడు పెనుగొండ ధర్మవరం నియోజకవర్గాలకు మహారాష్ట్రకు చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి దీపక్ చంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ పుట్టపర్తి కదిరి హిందూపురం మడకశిర నియోజకవర్గాలలో ఎన్నికల నియమావళిఉల్లంఘనలపై తన 9849288783 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం దీపక్ చంద్ర మాట్లాడు పెనుకొండ రాప్తాడు ధర్మవరం నియోజకవర్గాలలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ప్రజలు 9849288782 ఫోన్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. జిల్లాలో సాధారణ ఎన్నికలు ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ప్రజలు ఎన్నికల నియమావళి ఉల్లంఘన శాంతిభద్రతలు ఎన్నికలకు సంబంధించి ఏ విషయంపైన అయినా తమకు ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పుట్టపర్తి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గాజుకుంట్లపల్లి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా దుద్దుకుంట మాట్లాడుతూ తప్పుడు హామీలతో మభ్య పెట్టే పచ్చపార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి ,మైనార్టీ నాయకుడు తుమ్మల షామీర్‌బాషా, జడ్పిటిసి కుర్లి దామోదర్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, మార్కెట్ చైర్మన్ శ్రీనివాసులు, చిట్వేలు బాబా ఫక్రుద్దీన్, గోవిందు, జగన్ మోహన్ చౌదరి, రంగారెడ్డి, తుమ్మల బాబా, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారంతో ముగిసింది. ధర్మవరం నుంచి 26 మంది తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నామినేషన్ల పక్రియ ఈనెల 18 నుంచి ప్రారంభంగా 25వ తేదీతో ముగిసింది. ఇందులో బిజెపి తరఫున సత్య కుమార్ యాదవ్, అంబటి సతీష్ కుమార్, వైసీపీ తరఫున కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ తరఫున రంగన్న అశ్వర్థ నారాయణ, బిఎస్పీ తరఫున సాకే వినయ్ కుమార్, నవతరం పార్టీ తరఫున షేక్ అయాజ్, అఖిల భారత కిసాన్ జనతా పార్టీ తరఫున గట్టు చైతన్య, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ తరఫున ఎస్ వీరనారాయణ స్వామి, జై భీమ్రామ్ భారత్ పార్టీ తరఫున ధారా శంకర్ నామినేషన్లు దాఖలు చేయగా స్వతంత్ర అభ్యర్థులుగా దాసరి కవిత, సూర్యనారాయణ, బిల్లే నరేంద్ర, బీరే సోమశేఖర్, నాగు రవీంద్రారెడ్డి, ఎం ఈశ్వర్ రెడ్డి, ఎం ధనుంజయ, ఇలియాజ్ మహమ్మద్ సయ్యద్, శ్రీరాముల నాయక్ నామినేషన్లు దాఖలు చేశారు వీరిలో కొందరు రెండు సెట్లు చొప్పున అటు ప్రధాన పార్టీలు ఇటు స్వతంత్రులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు.

పురంలో 35 నామినేషన్లు

హిందూపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మొదటి మొదటి పర్వం నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. గత ఏడు రోజుల్లో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 21 మంది అభ్యర్థులు 35 సెట్ల నామినేషన్ లు దాఖలు చేసినట్లు జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్ తెలిపారు. చివరి రోజు గురువారం వివిధ పార్టీల నుంచి ఏడుగురు అభ్యర్థులు, ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులుగా వారి నామినేషన్లను ఎన్నికల అధికారికి అందించారు.మొత్తం నామినేషన్లను పరిశీలిస్తే ఎం శ్రీరాములు బి.ఎస్.పి తరపున రెండు సెట్లు, నందమూరి బాలకష్ణ టిడిపి తరపున 4 సెట్లు, కోడమూరు నౌషాద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి తరపున రెండు సెట్లు, రవీంద్ర ఎస్ యు సి ఐ తరపున రెండు సెట్లు, మొహమ్మద్ గౌస్ స్వతంత్ర అభ్యర్థి ఒక సెట్టు, వెంకటేష్ రెడ్డి వైసిపి రెబల్ అభ్యర్థిగా ఒక సెట్టు, స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్టు, డాక్టర్ లోకేంద్రనాథ్ రెండు సెట్లు, సుమలత ఒక సెట్టు, అనిల్ కుమార్ ఒక సెట్టు, స్వామి పరిపూర్ణానంద సరస్వతి రెండు సెట్లు, జి నాగరాజు జై భీమ్ రావ్ భారత్ పార్టీ ఒక సెట్టు, వైసీపీ పార్టీ తరపున దీపిక రెండు సెట్లు, ఇదే పార్టీ తరపున డమ్మీ అభ్యర్థిగా వేణు రెడ్డి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ తరపున డమ్మీ అభ్యర్థిగా హసీనా ఒక సెట్టు, సాయి నందిని ఒక సెట్టు, ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి ఎంహెచ్ ఇనాయతుల్లా రెండు సెట్లు, సురేష్ ఒక సెట్టు, టిడిపి డమ్మీ అభ్యర్థిగా నందమూరి వసుంధర దేవి రెండు సెట్లు, కె ఆర్ పార్వతి ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరపున ఒక సెట్టు, షేక్ షౌకత్ సమాజ్ వాది పార్టీ తరపున ఒక సెట్టు, తలారి శ్రీనివాసులు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్టు నామినేషన్ లను దాఖలు చేశారు. మొత్తం 21 మంది అభ్యర్థులు 35 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఇందులో చివరికి ఎంతమంది బరిలో ఉంటారు అన్నది మరో రెండు రోజుల్లో తేలనుంది.

నామినేషన్ దాఖలు చేస్తున్న బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి